www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 27 మే 2025

సత్యవాడలో కొనసాగిన వైద్యశిబిరం

ప్రజాశక్తి - రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని సత్యవాడ గ్రామంలో కోవిడ్ పాజిటివ్ కేసులతో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం సోమవారం కొనసాగింది. వైద్య శిబిరాన్ని సబ్ డివిజన్ వైద్యాధికారి డాక్టర్ ఎన్.ప్రశాంతి పరిశీలించారు. పామర్రు వైద్యులు డాక్టర్ విష్ణువర్ధన్, ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. కొత్తగా జ్వరం కేసులు నమోదు కాలేదని ఈ సందర్భంగా వారు వివరించారు. గ్రామ కార్యదర్శి గౌతమి ఆధ్వర్యంలో జరుగుతున్న పారిశుధ్య పనులను వైద్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ స్వచ్ఛమైన తాగునీరు తీసుకోవాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు మాస్కులు ధరించాలని, శానిటైజర్లు ఉపయోగించాలన్నారు.

ముంచుకొచ్చిన మృత్యువు

- గోదావరిలో 8మంది యువకులు గల్లంతు
- మృతులంతా 20 ఏళ్ల లోపు వారే..
- దివాన్ చెరువు రోడ్డు ప్రమాదంలో నలుగురు మృత్యువాత

ప్రజాశక్తి - అమలాపురం, ముమ్మిడివరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పు గోదావరి జిల్లాల్లో సోమవారం జరిగిన రెండు వేర్వేరు ఘటనలతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విషాదం నెలకొంది. స్నానానికి వెళ్లి 8 మంది యువకులు గల్లంతు కావడంతో కోనసీమలో, రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందడంతో కొవ్వూరులో విషాదకర వాతావరణం నెలకొంది.

ఘటనా ప్రాంతంలో స్థానికుల గాలింపు

కె.గంగవరం మండలం శేరుల్లంకలో శుభకార్యానికి వెళ్లిన యువకుల్లో 11 మంది స్నానం కోసం ముమ్మిడివరం మండలం కమిని లంకకు వెళ్లారు. అక్కడ గోదావరి నదిలో దిగారు. లోతు ఎక్కువగా ఉండటంతో 8 మంది గల్లంతయ్యారు. ముగ్గురు సురక్షితంగా బయటకు వచ్చారు. గల్లంతైన వారిలో కాకినాడకు చెందిన సబ్బిత క్రాంతికిరణ్(20), సబ్బిత పాల్అభిషేక్(18), తాతిపూడి నితిష్(18), ఎలుమర్తి సాయి(18), మండపేటకు చెందిన రోహిత్(18), శేరిలంకకు చెందిన ఎలిపే మహేష్(14), ఐ.పోలవరం మండలం ఎర్రగరువుకు చెందిన వడ్డి మహేష్(15), వడ్డి రాజేష్(13) ఉన్నారు. వీరిలో క్రాంతికిరణ్, పాల్ అభిషేక్‌లు అన్నదమ్ములు వీరు కాకినాడ ఆదిత్య కళాశాలలో ఇంటర్ చదవుతున్నారు. అలాగే ఎర్రగరువుకు చెందిన మహేష్, రాజేష్‌లు సోదరులు. వీరు గోడి గురుకుల హాస్టల్‌లో ఉండి చదువుకుంటున్నారు.

కొనసాగుతున్న గాలింపు

యువకుల గల్లంతు సమాచారాన్ని అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి గజ ఈతగాలు, గ్రామస్తుల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి కావడంతో గాలింపు చర్యలకు ఇబ్బందులు తలెత్తాయి. గోదావరి మధ్యలో కావడంతో విద్యుత్ సదుపాయం కూడా లేకపోవడంతో చీకట్లు కమ్ముకున్నాయి. అయినప్పటికీ గ్రామస్తుల సహకారంతో గాలింపును ముమ్మరం చేశారు.

ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్న కలెక్టర్, ఎస్పి

రోదనలతో నిండిపోయిన తీరం

గోదారమ్మ సవ్వళ్లతో ఉల్లాసంగా ఉండే తీరం.. యువకుల కుటుంబ సభ్యుల రోదనలతో నిండిపోయాయి. ఘటనా విషయాన్ని తెలుసుకున్న యువకుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు కమిని లంకకు చేరుకున్నారు. కన్నకొడుకులను కోల్పోయిన వారు గుండెలవిసేలా రోదిస్తున్నారు. వారిని సముదాయించడం ఎవరితరమూ కావట్లేదు. వారి రోదనలతో అక్కడ విషాద వాతావరణం నెలకొంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు దిగ్భ్రాంతి

గోదావరి నదిలో యువకులు గల్లంతుపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోనసీమ జిల్లా కలెక్టర్‌తో ఆయన ఫోన్లో మాట్లాడారు. ఘటనా పూర్వాపరాలను తెలుసుకున్నారు. గల్లంతైన వారిని రక్షించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గాలింపు చర్యల వివరాలను చంద్రబాబుకు కలెక్టర్ వివరించారు. అలాగే స్థానిక మంత్రి వాసంశెట్టి సుభాష్ విచారం వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమన్నారు. యువకుల కోసం విస్తతంగా గాలింపు చేపట్టి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. బాధితుల కుటుంబాలు ధైర్యంగా ఉండాలన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

ముమ్మిడివరం మండలం కమినీలంకలో యువకులు గల్లంతైన ప్రాంతాన్ని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ఎస్పి బి.కృష్ణారావు పరిశీలించారు. గాలించి చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. గాలింపునకు అన్ని చర్యలూ తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. వారి వెంట అదనపు ఎస్పి ప్రసాద్, ఆర్‌డిఒలు డి.అఖిల, కె.మాధవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

యువకుల కుటుంబాలను ఆదుకోవాలి : సిపిఎం

గోదావరిలో గల్లంతైన యువకుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని వారికి అండగా నిలవాలని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ ఘటన చాలా బాధాకరమన్నారు. గల్లంతైన యువకుల కోసం విస్తతంగా గాలింపు చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. గోదావరి పర్యాహక ప్రాంతాలు, సముద్ర తీర ప్రాంతాల్లో ఇటీవల కాలంలో చాలా మంది గల్లంతవుతున్నారని, ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వం పటిష్టమైనటువంటి చర్యలు తీసుకోవాలని కోరారు.

కొవ్వూరు.. కన్నీరు

రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

ప్రజాశక్తి - కొవ్వూరు, రాజానగరం, చాగల్లు

ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువు సమీపంలో గామన్ బ్రిడ్జి వద్ద జరిగిన ప్రమాదంతో కొవ్వూరులో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల్లో ముగ్గురు కొవ్వూరు వాసులే కావడంతో స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. మరో కుటుంబంలో భార్య మృతి చెందగా భర్త తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు.

కొవ్వూరు పట్టణానికి చెందిన ఉప్పులూరి వరప్రసాద్, శివలీలావతి దంపతుల ఏకైక కుమార్తె ఆరేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో మనవరాలు యోగక్షేమాలు అమ్మమ్మ, తాతయ్యలే చూస్తున్నారు. ప్రస్తుతం వారి మనవరాలు కాకినాడలో ఇంజినీరింగ్ చదవుతుంది. సోమవారం మనవరాలు పుట్టిన రోజు కావడంతో ఆమెను చూసేందుకు ఇంటి పక్కనే ఉంటున్న లంకసాని సురేష్, అతని భార్య బిందు, వరప్రసాద్ వరప్రసాద్ అత్త ఇమ్మణ్ణి వీరవెంకటసత్యవతిలతో కలిసి కారులో బయలు దేరారు. మార్గం మధ్యలో ఫైట్ క్వారియర్స్ వద్ద ఆర్‌టిఎ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. దీన్ని గుర్తించిన దివాన్‌చెరువు వైపు నుంచి వస్తున్నలారీ డ్రైవర్ డివైడర్ ఆవలివైపున ఉన్న ఖాళీస్థలంలో లారీని పార్క్ చేసేందుకు ఉపక్రమించాడు. ఇదే సమయంలో వరప్రసాద్ కుటుంబం ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి ఈ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున ఉప్పులూరి వరప్రసాద్(60), అతని భార్య శివలీలావతి(57), సత్యవతి(75) అక్కడికక్కడే మృతి చెందారు. లంకసాని బిందు, సురేష్ దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని ఆసుపత్రికి తరలిస్తుంగా పరిస్థితి విషమించడంతో బిందు(34) మార్గం మధ్యలోనే మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన సురేష్ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆరేళ్ల క్రితమే వివాహం..

ఈ ప్రమాదంలో చాగల్లుకు చెందిన లకంసాని బిందుకు చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన సురేష్‌తో ఆరేళ్ల క్రితం వివాహమైంది. సురేష్ ప్రస్తుతం అవంతి ఫీడ్స్ ఫ్యాక్టరీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. దీంతో కొవ్వూరులో ఉప్పులూరు వరప్రసాద్ ఇంటి పక్కన అద్దెకు ఉంటున్నారు. ఈ రెండు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం బాగా ఉంది. ఈ చనువుతోనే వరప్రసాద్ కుటుంబంతో కలిసి వారు కాకినాడకు బయలు దేరారు. సురేష్, బిందు ఆరేళ్లుగా ఎంతో అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఈ ప్రమాదంలో బిందు మృత్యువాత పడటం అందర్నీ కలచివేసింది. ఆరేళ్లకే జీవిత భాగస్వామిని కోల్పోవడాన్ని సురేష్ తట్టుకోలేక పోతున్నాడు.

కలెక్టర్ కార్యాలయంవద్ద వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో ధర్నా

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి - అమలాపురం

ఉపాధి హామీ నిధులు తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మికులు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆరు వారాల నుంచి ఉపాధి కూలీలు పనులు చేస్తున్నా ఒక్కరోజు వేతనం కూడా ప్రభుత్వం చెల్లించలేదని దీంతో ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ఉపాధి బకాయిలు రూ.55 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి కోపం వచ్చినప్పుడల్లా ఉపాధి చట్టాన్ని ఎత్తి వేస్తామని అంటున్నారని, గ్రామాల్లో ఉన్న పెత్తందారులు భూస్వాములు కూడా అదేమాట అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితిలో ఈ చట్టం రద్దు అవ్వకుండా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ చట్టాన్ని కాపాడు కుంటేనే కూరీలీలకు ఎంతో కొంత మేలు జరుగుతుందని తెలిపారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు ముందు ఇచ్చిన ప్రకారం కూలీలు అందరికి ఆరునెలల పాటు రూ.6వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నా జరుగుతున్న సందర్భంలోనే వైసిపి జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఈ ధర్నాకి మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. కూలీలకు వేతనం తక్షణమే ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి పార్టీ పూర్తి మద్దతు తెలియజేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా నాయకులు జి.దైవకృప, పి.శివ ,పెట్టా ఆనందరావు, అనంతలక్ష్మి, బీర వెంకట్రావు, ఇసుకపట్ల మంగాదేవి, శకుంతల, మట్టపర్తి రాజేశ్వరి, పులుసుగంటి సత్యనారాయణ, దంగేటి వినాయకరావు, బి.సీత తదితరులు పాల్గొన్నారు. **కె.గంగవరం:** మండలంలో ఉపాధి హామీ కూలీల బకాయిలు రూ. 3.30 కోట్లు చెల్లించాలని సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి చీకట్ల వేంకటేశ్వర రావు, వెంటపల్లి భీమ శంకరం, పిడిఎస్‌యు నాయకులు బి. సిద్ధూ, చింతా రాజారెడ్డి తదితరులు మాట్లాడారు. అనంతరం ఎంపిడిఒ శ్రీనివాస్, అధికారులు సాగర్, ప్రసాద్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కూలీలు పి. శేషారావు, జె. ప్రసాద్, బి. ధనరాజు, ఎట్క. రాజారావు, ఎ. సత్యనారాయణ, రావి వెంకట్రావు, భాను, బూసమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రహంతుల్లా

లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

చిన్నారులపై లైంగిక నేరాలకు పాల్పడే వారికి చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని మండల లీగల్ కమిటీ సర్వీసెస్ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక కోర్టు ప్రాంగణంలో సోమవారం పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొన్న మెజిస్ట్రేట్ రహంతుల్లా మాట్లాడుతూ తీవ్రమైన లైంగిక వేధింపుల కేసుల్లో జరిమానాలు, జైలు శిక్షలు విధించటం జరుగుతుందని, అలాగే చిన్నారులైనా, యుక్త వయసు పిల్లలపై జరిగే లైంగిక నేరాల నుంచి రక్షణ కల్పించేందుకు పోక్సో చట్టం రూపొందించారని ఆయన వివరించారు. యువత సన్మార్గంలో నడిచిన భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ ప్రెసిడెంట్ వడ్డీ నాగేశ్వరరావు, ఎజిపి కాశి సిద్ధార్థ కుమార్, ప్యానల్ లాయర్ కెఆర్‌కె.రాజు అడ్వేకెట్స్ గుత్తుల శ్రీనివాసరావు, అయినవిల్లి వలియా బాబా, గ్రంధి వెంకట రామారావు, కెఎల్‌వి.ప్రసాద్, నరేష్, సిఐ ఎం.మోహన్ కుమార్, ఎస్ఐ డి.జ్వాలా సాగర్, కోర్టు సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం సభా స్థలం పరిశీలన

ప్రజాశక్తి - ముమ్మిడివరం

పరిశీలిస్తున్న అధికారులు

సిఎం చంద్రబాబు ఈనెల 31న బంగారు కుటుంబం కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం కలెక్టర్, ఎస్పిలు, అధికారులు సభా స్థలాన్ని పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రి పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది. ముమ్మిడివరం నియోజకవర్గ పరిధిలోని సిహెచ్.గున్నేపల్లి గ్రామంలోని ఒఎన్‌జిసి సైట్‌లో హెలిపాడ్ ల్యాండ్ అయ్యే ప్రాంతాన్ని, ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలం ప్రాంగణాన్ని కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పి కష్ణారావు, అధికారుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొనే బంగారు కుటుంబం కార్యక్రమంతో పాటు నియోజక వర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో పాల్గొంటారని అన్నారు. అనంతరం కాట్రేనికోన మండలం చెయ్యేరు గ్రామంలో దాతలు, ప్రజల భాగస్వామ్యంతో జిల్లా స్థాయిలో ప్రారంభించే (పి4)కార్యక్రమం, చెరువుల పూడిక తీత అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి పరిశీలిస్తారన్నారు. అదే విధంగా చెయ్యేరు గ్రామాన్ని ప్రభుత్వ పథకాల ద్వారా అమలు చేసేందుకు భౌగోళిక విస్తీర్ణం, జనాభా తదితర వివరాలను సేకరించి సిద్ధం చేయాలని జిల్లా పంచాయతీ అధికారిణి శాంతి లక్ష్మిని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ బి.రాము, పంచాయతీ రాజ్ ఎస్ఇ పి రామకృష్ణారెడ్డి, ఆర్‌డిఒ కె.మాధవి, సిఐ మోహన్ కుమార్, ఎస్ఐ జ్వాలా సాగర్, డిటి గోపాల కృష్ణ లతో పాటు వివిధ శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - మామిడికుదురు

మొగలికుదురు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీయ కలయిక సోమవారం ఘనంగా నిర్వహించారు. 2005 -2006 ఏడవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలుసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం భోజనాలు చేసి తోటి మిత్రులతో కలిసి ఉత్సాహంగా రోజంతా గడిపారు.

పాల్గొన్న పూర్వవిద్యార్థులు

ఆనాటి చదువులు నేర్పిన గురువులను సత్కరించారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి - రావులపాలెం


నైట్ వాచ్ మెన్ సమసల్య పై మాట్లాడుతున్న నూకల బలరాం

స్కూల్ నైట్ వాచ్ మెన్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలని జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి నూకల బలరాం డిమాండ్ చేశారు. బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలు వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన స్కూల్ నైట్ వాచ్ మెన్ సమస్యలపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బలరాం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో నైట్ వాచ్‌మెన్లగా పనిచేస్తున్న ఉద్యోగులకు ఇచ్చే జీతం రూ.6000 అని అవి కూడా నాలుగు నెలల నుండి ఇవ్వకపోతే వారు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. వెంటనే బకాయి ఉన్న నాలుగు నెలల జీతాలను వెంటనే విడుదల చేయాలని అన్నారు. వీరితో 16 గంటల పని చేయించుకుంటున్నారు అని ఇది దారుణమన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలన్నారు.. ఈ కార్యక్రమంలో స్కూల్ నైట్ వాచ్మెన్ల సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ పంపిణీపై డీలర్ల హర్షం

ప్రజాశక్తి - ఆలమూరు

ఎంఎల్ఎ బండారుకు కృతజ్ఞతలు తెలుపుతున రేషన్ డీలర్లు

ఎండియు వాహనాలు రద్దుచేసి జూన్ 1 నుండి చౌక దుకాణాలు ద్వారా పంపిణీ చేసే నిర్ణయం ప్రభుత్వం తీసుకోవడంతో మండల రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావుకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు సోమవారం వాడపాలెం ఎంఎల్ఎ కార్యాలయం వద్ద రేషన్ డీలర్లు ఎంఎల్ఎ బండారును కలిసి సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక శాతం ప్రజలు రేషన్ దుకాణాల వద్దే సరుకులు తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. అలాగే రేషన్ డీలర్లకు పూర్వ వైభవం తెచ్చిన కూటమి ప్రభుత్వానికి పలువురు రేషన్ డీలర్లు ఎంఎల్ఎ సత్యానందరావు ద్వారా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల రేషన్ డీలర్ల సెక్రటరీ కాలా జయరాజు, కె.శివ కుమార్, డి శ్రీనివాసు, ఎ.రామకృష్ణ, ఎస్.రామకృష్ణ, కె.అప్పా రావు, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మౌలిక వసతులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - అంబాజీపేట

సిసి రోడ్లు, డ్రెయినేజీలు తదితర మౌలిక వసతులు కల్పించాలని ఎన్నో ఏళ్లగా ఎదురు చూస్తున్నట్లు అంబాజీపేట మండలం మాచవరం మెట్ల రాంజీ కాలనీవాసులు వాపోతున్నారు. ఈ మేరకు సోమవారం అంబాజీపేట ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆ కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలిపిన వివరాలు...ఈ కాలనీ ఇచ్చి 25 సంవత్సరాలు అయ్యింది. కాని సరైన రోడ్లు గాని, డ్రెయినేజీలు గాని లేక కొద్దిపాటి వర్షం వచ్చిన గ్రామస్తులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కాలనీ నివాస యోగ్యంగా లేకపోవడం వలన చాలమంది గహాలు నిర్మిచుకోకుండా అద్దె గృహాలలో నివసిస్తున్నారు. అనేకమార్లు ఇదే సమస్యపై పలు ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిహెచ్.కరుణా కర్, సిర్రా హరిబాబు, తొత్తరమూడి రాజుకుమార్, చేట్ల సత్తిబాబు, ఈతకోట సురేష్ రాజు, గుమ్మడి యేసు, మంద వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



నాణ్యమైన విద్యకు కేరాఫ్‌గా సాయిరామ్

ప్రజాశక్తి - ఐ.పోలవరం

శ్రీనివాసురావు
కరస్పాండెంట్

మండలంలోని గుత్తెనదీవిలో 25 ఏళ్ల క్రితం స్థాపించిన సాయిరామ్ విద్యానికేతన్ హైస్కూల్ నాణ్యమైన విద్యను అందరికి అందించి ఉత్తమ ఫలితాలు సాధించుట కొరకు కృషి చేస్తున్నామని పాఠశాల కరస్పాండెంట్ సలాది శ్రీనువాసురావు, ప్రిన్సిపల్ మాగాపు సీతారత్నం పేర్కొన్నారు. వారు పాఠశాలకు సంబంధించి పలు అంశాలను 'ప్రజాశక్తి'కి వివరించారు. 2005లో 40 మంది విద్యార్థులతో అద్దె భవనంలోకి ప్రారంభించిన సాయిరామ్ పాఠశాల నేడు 500 మందికి పైగా విద్యార్థులతో సువిశాలమైన తరగతి గదులు కలిగిన సొంత భవనంలోకి మారేస్థితికి చేరుకుందని అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పటిష్టమైన ప్రణాలికను అనుసరిస్తూ విద్యార్థులను ఇంజినీర్లు, డాక్టర్లు తీర్చిదిద్దామన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు విదేశాలలో ఉన్నారని, ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని అన్నారు. ప్రతీ విద్యార్థిపై నా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. పాఠశాలలో చదివే విద్యార్థులకు సైన్స్ ఫెయిర్ నిర్వహిస్తున్నామని విద్యార్థులకు ఇంకా మెరుగైన విద్యను అందించడం కోసం వరల్డ్ క్లాస్ కరిక్యులం అయిన లీడ్ ప్రోగ్రామ్‌ని సాయిరామ్ విద్యానికేతన్‌లో ఇంప్లిమెంట్ చేస్తున్నామన్నారు. ఈ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు ఇంగ్లీష్ కమ్యూనికేషన్ బాగా ఇంప్రూవ్ చేయడానికి, మ్యాథ్స్, సైన్స్‌లలో కాన్సెప్ట్‌తో బోధన ఉంటుందని ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్‌తో పాఠ్యాంశాలు ఉంటాయన్నారు. దీనివల్ల భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి మంచి ఉద్యోగం సాధించేందుకు ఈ ప్రోగ్రామ్స్ డిజైనింగ్ ఉంటుందన్నారు. దీనిలో భాగంగా అన్ని క్లాస్ రూమ్స్‌లో స్మార్ట్ టివి, ట్యాబ్ తో అనుసంధానం చేయబడి విద్యాబోధన ఉంటుందని వారు అన్నారు. ఆల్ రౌండ్ డవలప్ మెంట్ కొరకు వత్తిడి లేని విలువలతో కూడిన అతి తక్కువ ఫీజులతో ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారులకు అన్ని కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడేలా క్వాలిటీ విద్యను అందిస్తున్నామని అన్నారు. ప్రతి సంవత్సరం ఒకరు లేక ఇద్దరు పెద్దాపురం జవహర్ నవోదయా విద్యాలయానికి ఎంపిక కావడం జరుగుతోందన్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి పొట్టుపర్తి పద్మని సిరి పెద్దాపురం జవహర్ నవోదయా విద్యాల యానికి ఎంపికైంది. 2024-25 పదవతరగతి పబ్లిక్ పరీక్షలలో 16 మంది విద్యార్థులు హాజరుకాగా 11 మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారన్నారు. మద్దింశెట్టి సాయివినయ రామ 553/600, బొండా యశస్వి 546/600, దుళ్ల అలేఖ్య 540/600 మార్కులు సాధించారన్నారు. మా చిన్నారులు క్లాసికల్ డ్యాన్స్‌లో నాట్యమయూరి బహుమతులు సాధించారన్నారు. ఆల్ ఇండియా లీడ్ స్టూడెంట్ ఛాంపియన్ షిప్‌లో 34 మంది విద్యార్థులు ఎంపికైయ్యారన్నారు. నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలకు మా 6గురు విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఇంటర్నేషనల్ డ్రాయింగ్ కాంపిటీషల్లో 10మంది విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారన్నారు.

సాయిరామ్ విద్యానికేతన్




నవోదయకు ఎంపికైన పద్మని సిరిని అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

హైస్కూల్ ప్రత్యేకతలు

- లీడ్ స్టూడెంట్ యాప్ 100 శాతం బోధన
- 2025-26 నుంచి ఐఐటి, జెఇఇ, నీట్ ఫౌండేషన్ కోర్సులు
- 1వ తరగతి నుంచి కంప్యూటర్ క్లాసులు
- విద్యార్థులకు విశాలమైన ఆట స్థలం
- ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్
- సిసి కెమెరాల ద్వారా విద్యార్థుల పర్యవేక్షణ
- దూర ప్రాంతాల విద్యార్థులకు బస్సు, ఆటో సదుపాయం
- నర్సరీ నుంచి టెన్త్ వరకు అన్ని సబ్జెక్టుల బోధనకు అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మంచి అనుభవం, ఇంగ్లీష్‌లో ప్రావీణ్యం ఉన్న వారికి కార్పొరేట్ తరహాలో జీతాలు
- మ్యాథ్స్, ఫిజిక్స్, హిందీ, ఇంగ్లీషు, సైన్స్ టీచర్లకు యానాం-ఎదుర్లంక బ్రిడ్జి నుంచి ప్రత్యేక వాహన సదుపాయం

నేరాలు ఘోరాలు

యువతి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉప్పలగుప్తం

మనస్తాపంతో యువతి చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ సిహెచ్.రాజేష్ కథనం ప్రకారం.. ఎస్.యానాం పెదపేటకు చెందిన అవివాహిత యువతి మట్టా సునీత(24) ఆదివారం సాయంత్రం ఇంటి పక్కన గల రేకుల షెడ్డులో చున్నీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు పాల్పడిన చోట సూసైడ్ నోట్ రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామానికి చెందిన వివాహితుడైన పెట్టా మురళి సునీతను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. దీంతో మనస్తాపానికి గురై తన కుమార్తె సునీత ఆత్మహత్యకు పాల్పడినట్టు సునీత తండ్రి నకులుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

కుటుంబం ముసుగులో గంజాయి రవాణా

ప్రజాశక్తి - జగ్గంపేట, కిర్లంపూడి

కుటుంబం ముసుగులో గంజాయి రవాణా చేస్తున్న ముఠాను పోలీసులు గుట్టురట్టు చేశారు. పెద్దాపురం డిఎస్‌పి శ్రీహరిరాజు తెలిపిన వివరాలివి. ప్రయాణికుల ముసుగులో చిత్రకొండ నుంచి మహారాష్ట్రలోని షిరిడీ ప్రాంతానికి బొలెరో, మారుతి బ్రెజా కారుల్లో గంజాయిని రవాణా చేస్తుండగా కృష్ణవరం టోల్ గేట్ వద్ద పలువురిని పట్టుకున్నట్టు తెలిపారు.కారులో ప్రత్యేకంగా అరలను తయారు చేసి అనుమానం రాకుండా తరలిస్తున్న 75 ప్యాకెట్లలో ఉన్న 163.250 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులను, ఇద్దరు మహిళలను, ఒక బాలికను అరెస్ట్ చేసినట్టు తెలిపారు. రెండు కార్లను, రూ.40 వేలు విలువైన 8 సెల్ ఫోన్లు, రూ.880 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయి విలువ రూ.8 లక్షల 16 వేలు ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్, ఎస్ఐలు రఘునాధరావు, సతీష్, సిబ్బంది ఉన్నారు.

సారా స్వాధీనం : ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సోమవారం నిర్వహించిన దాడుల్లో 16 లీటర్ల సారాతో ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ దుర్గార్జునరావు తెలిపారు. ఈ దాడుల్లో ఇద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామన్నారు. సారా కేసులకు సంబంధించి తప్పించుకు తిరుగుతున్న ఆరుగురుని అరెస్టు చేసి సోమవారం కోర్టులో హాజరు పరచామన్నారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి -కొవ్వూరు

పట్టణంలోని ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ రాత్రి ఎస్‌సి కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కెఎస్.జవహర్ ఇంట్లో చోరీ కేసును పోలీసులు చేదించారు. జంగారెడ్డిగూడెంకి చెందిన పోలవరపు నాగ దుర్గాప్రసాద్, వేగవరానికి చెందిన దుగ్గిరాల శివరామకృష్ణ, దొమ్మేరుకు చెందిన గుంటూరు నందీశ్వరుడు, శ్రీకాకుళం జిల్లా కొండ రాగోలు గ్రామానికి చెందిన మంతెన చైతన్య అనే నలుగురు నిందితులను అరెస్ట్ చేశామని సిఐ పి.విశ్వం తెలిపారు. ఏప్రిల్ 28వ తేదీ సాయంత్రం ఇంటికి తాళాలు వేసుకుని జవహర్ కుటుంబం తన స్వగ్రామ మైన తిరు వూరు మండలం గానుగ పాడుకు వెళ్లారు. ఈనెల మూడో తేదీ సాయం త్రం 4:30 సమయంలో మొక్క లకి నీళ్ళు పోయడానికి వచ్చిన రాజు అనే వ్యక్తి ఇంటి వెనక తలుపులు తెరిచి ఉండడాన్ని గుర్తించారు. దీంతో జవహర్ కుమారుడు ఆశిష్ అమత్ లాల్ వారి ఇంటికి వచ్చి చూడగా, ఇంట్లో రూ.30 వేలు నగదు, రాడార్ వాచ్ -1, శాంసంగ్ టీవీ దొంగిలించుకుని పోయినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి విచారణ జరపగా నలుగురు చోరీకి పాల్పడినట్లు గుర్తించామన్నారు. డిఎస్‌పి జి.దేవకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారన్నారు. నిందితుల నుంచి నగదు, టీవీని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితులు మరో దొంగతనాలు చేసినట్లుగా విచారణలో బయటపడిందన్నారు రెండు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసును చేదించి నందుకు ఎస్‌సి అభినందించినట్లు సిఐ తెలిపారు.

ఎండియు వ్యాన్‌లను కొనసాగించాలి

ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న పిల్లి సూర్య ప్రకాష్

ప్రజాశక్తి - రామచంద్రపురం

ప్రజాపంపిణీ వ్యవస్థలో నిత్యావసర వస్తువుల పంపిణీ చేస్తున్న మొబైల్ వ్యాన్లను కొనసాగించాలని కోరుతూ సోమవారం రామచంద్రపురం ఆర్‌డిఒకు వినతిపత్రం సమర్పించారు. వైసిపి ఇన్‌ఛార్జి పిల్లి సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాష్ మాట్లాడుతూ 2021లో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్ పంపిణి కోసం 9,260 రైస్ మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు ఏర్పాటుచేసి సూమారు 18,520 మంది ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు జీవనోపాధిని కల్పించారన్నారు. 2021 కరోనా సమయంలోను వీరు పంపిణీ చేశారు. అపరేటర్లుకు 2027 జనవరి వరకు గడువు ఉన్నప్పటికీ వారితో సంప్రదిం పులు, చర్చలు జరపకుండా వారిని రద్దు చేస్తూ జారీ చేసిన జిఒను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కె.గంగవ రంలోని ఇసుక అక్రమ ర్యాంపును నిలిపివేయాలని సూర్యప్రకాష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపిపిలు అంబటి భవాని, పంపన నాగమణి, మహిళా విభాగం నాయకులు, ఎల్లమిల్లి సతీష్ కుమారి, పలు గ్రామాల సర్పంచులు ఎంపిటిసిలు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు. **అమలాపురం:** రేషన్ పంపిణీ వాహనాలను రద్దు చేసే ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని జిల్లా లో రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా సోమవారం ర్యాలీ నిర్వహించారు. లబ్ధిదారులకు సంఘీభావంగా బహుజన్ సమాజ్ పార్టీ అమలాపురం నియోజకవర్గ ఇన్చార్జ్ పొలమూరి మోహన్ బాబు పాల్గొని పూర్తి మద్దతు తెలిపారు. సంపద సృష్టిస్తామన్న కూటమి ప్రభుత్వం గ్రామీణంలో పనిచేస్తున్నటు వంటి నిరుద్యోగ యువతకు ఆనాటి ప్రభుత్వం ప్రవేశపెట్టి నంటి ఇంటింటకీ రేషన్ పంపిణీ వాహన వాహనాలను రద్దు చేయడం అన్యాయమని, తక్షణమే దాన్ని విరమించుకోవాలని 2027 వరకు ఉన్న తమ అగ్రిమెంట్లు కొనసాగించాలని, అలాగే పెరిగిన పెట్రోల్ డీజిల్ ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని. ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు జిత్తుకు సత్యనారాయణ యూనియన్ నాయకులు పెద్ద ఎత్తున వాహన దారులు పాల్గొన్నారు.

నేటి నుంచి డిఆర్‌పిలకు శిక్షణ

ప్రజాశక్తి - అమలాపురం

ఫౌండేషన్ లిటరసీ అండ్ న్యూమరసీ(ఎఫ్ఎల్ఎన్) డిఆర్‌పిలకు నేటి నుంచి ఆరు రోజుల పాటు శిక్షణను అల్లవరం మండలం ఓడలరేవు బివిసి ఇంజినీరింగ్ కళాశాలలో ఇస్తున్నామని డిఇఒ షేక్ సలీం బాషా అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్(సాల్ట్)లో భాగంగా ఎన్‌జిఒ సంస్థ ప్రథమ భాగస్వామ్యంతో ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పూర్వ ప్రాథమిక, ప్రాథమిక పాఠశాలల్లో గత విద్యా సంవత్సరం నుంచి అమలు చేస్తున్నామన్నారు. నిపుణ్ భారత్ లక్ష్యాలను సాధించే ందుకు ఎర్లీ చైల్డ్ సెంటర్ ఎడ్యుకేషన్(ఇసిసిఇ)ను ప్రవేశ పెట్టారన్నారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో ఎంపిక కాబడిన డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్(డిఆర్‌పి)లకు మొదటి దశ శిక్షణ 2023 జూలైలో ఇచ్చారన్నారు. శిక్షణ పొందిన డిఆర్‌పిలు గతేడాది అక్టోబరు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు మొదటి దశ శిక్షణ పూర్తి చేశారన్నారు. రెండవ దశ అమల్లో భాగంగా ఈ నెల 20 నుంచి 25 వరకు కెఆర్‌పిలు విజయవాడలో శిక్షణ పొందారు. శిక్షణ పొందిన కెఆర్‌పిలు డిఆర్‌పిలకు శిక్షణ ఇస్తారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాతో పాటుగా, పశ్చిమగోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన 334 మంది డిఆర్‌పిలు ఆరు రోజుల పాటు రెసిడెన్షియల్ విధానంలో శిక్షణ పొందుతారు. కాకినాడ జిల్లా నుంచి 63, కోనసీమ జిల్లా నుంచి 66, తూర్పుగోదావరి జిల్లా 57, ఏలూరు జిల్లా 88, పశ్చిమగోదావరి జిల్లా నుంచి 60 మంది డిఆర్‌పిలకు శిక్షణ ఇస్తారని డిఇఒ ఈ సందర్భంగా తెలిపారు.

వారణాసి చిత్ర యూనిట్‌కు అభినందనలు

ప్రజాశక్తి - అమలాపురం

-అడబాల ప్రొడక్షన్స్ నిర్మాణంలో అడబాల రాహుల్ రాయ్ దర్శకత్వంలో యూట్యూబ్లో విడుదలై విజయవంతంగా ప్రదర్శిత మవుతున్న వారణాసి చిత్ర యూనిట్‌ను కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యా నందరావు అభినందించారు. ఈ కార్యక్రమంల అమలాపురం పట్టణంలోని ఎస్‌వి రెసిడెన్సీలోని కన్వెన్షన్ హాల్లో కళాపోషకులు అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసనస భ్యులు మాట్లాడుతూ ఇటువంటి మంచి చిత్రాలు మరిన్ని సమాజంలో మంచి పరివ ర్తనను తీసుకుని వచ్చే దిశగా రూపొందించాలని యూనిట్కు సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్ మాట్లాడుతూ ప్రేక్షకులకు మంచి సందేశం ఇస్తున్న ఈ చిత్రాన్ని ఆదరిం చాలని పిలుపునిచ్చారు. డిఎస్‌ఒ మాట్లాడుతూ ఈ చిత్ర చిత్రీకరణ ఆద్యంతం కోనసీమలోనే చిత్రీకరించడం జరిగిందని, జిల్లాలో ప్రకృతి అందాలు కూడా ఈ చిత్రం ద్వారా బాహ్య ప్రపంచానికి తెలిసేలా, దర్శకుడు ప్రతిభతో పాటు నటీ నటులందరూ కూడా చాలా చక్కగా నటించారన్నారు. అనంతరం దర్శకుడు అడబాల రాహుల్ రాయిని ఘనంగా సత్క రించారు.

మహానాడుకు తరలిన పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి - రావులపాలెం

కడపలో మూడు రోజుల పాటు నిర్వహించే టిడిపి మహానాడుకు కొత్తపేట ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావు పార్టీ శ్రేణులతో తరలివెళ్లారు. రావులపాలెం టిడిపి క్యాంపు కార్యాలయం వద్ద నుంచి సోమవారం ఉదయం ఆయన నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో కలిసి అధిక సంఖ్యలో వాహనాల్లో మహానాడుకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారం వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీలను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నందు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కలెక్టర్ మహేష్‌కుమార్, జెసి టి.నిషాంతి, డిఆర్ఒ రాజకుమారి, సర్వ శిక్ష ప్రోగ్రాం కో-ఆర్డినేట్ జి.మమ్మీ, డ్వామా పీడీ మధుసూదన్, డిఎల్‌డిఒ రాజేశ్వరరావు, ఎస్‌డిసి పి.కృష్ణమూర్తి లు అర్జీదారుల నుంచి సుమారుగా 211 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సమస్యకు తప్పక పరిష్కారం లభిస్తుందనే భరోసా అధికారులు కల్పించాలన్నారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన అర్జీల పరిష్కారంలోనూ సంక్షేమం, అభివృద్ధి పరంగా వచ్చిన ప్రతి ఆర్జీని సకాలములో నాణ్యవంతంగా పరిష్కరించాలన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యాల సాధనలో ప్రజా సమస్యల పరిష్కారమే తొలిమెట్టన్నారు. నిర్దిష్ట గడువులోగా సమస్యను పరిష్కరించడం ఎంత ప్రధానమో అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యను పరిష్కరించడం అంతే ప్రధానమని, అర్జీల పరిష్కార సంతృప్తి స్థాయి గ్రేడును పెంచేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ముఖ్యమంత్రి పిజిఆర్ఎస్ కార్యక్రమంపై ప్రత్యేకంగా దృష్టి సారించారని క్రమం తప్ప కుండా ప్రతి అంశంపైనా సమీక్ష నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తహశీల్దార్లు ఎంపిడిఒలు, సర్వేయర్లు తదితరులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి ప్రజల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులు సిబ్బందిపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య పరిష్కార సామర్థ్యాలపై ప్రత్యేక దృష్టి పెట్టినప్పుడే పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని ప్రతి అర్జీని పారదర్శకత, జవాబుదారీతనంతో పరిష్కరించాలన్నారు. అందిన ఆర్జీని పరిశీలించి గడువులోపు పరిష్కరించి వివరణ నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలను సావధానంగా విని అర్జీలను పరిశీలించి సత్వరం పరిష్కరించేందుకు ప్రభుత్వం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారుల సమక్షంలోనే అర్జీలు స్వీకరించి వాటి తక్షణ పరిష్కారానికి జిల్లా అధికార యంత్రాంగానికి స్పష్టమైన మార్గనిర్దేశం చేశామన్నారు. జెసి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 27వ తేదీ మాస్ ర్యాలీ అధికారులతో నిర్వహిస్తామన్నారు. ఈనెల 29వ తేదీ రైతులతో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. హార భద్రత చట్టప్రకారం ప్రస్తుత సీజన్లో మామిడిపండ్లు హానికర రసాయనాలతో మగ్గ పెట్టకుండా సహజంగా పండే వాటిని ప్రోత్సహించాలని సూచించారు. హానికర రసాయన పూతతో మగ్గపెట్టిన పండ్లు మార్కెట్లో విక్రయిస్తున్నట్లయితే ఫుడ్ సెక్యూరిటీ కంట్రోల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించి విక్రయదారులపై కఠిన చర్యలు తీసుకోవా లన్నారు. డిఆర్ఒ రాజకుమారి ప్రసంగిస్తూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పౌరుల సమస్యలను, ఫిర్యాదులను ప్రభుత్వ శాఖలు, అధికారులు, సంస్థలకు తెలియపరచి వాటికి పరిష్కారాన్ని పొందడానికి రూపొందించబడిన వ్యవస్థని, ఈ వ్యవస్థ పౌరులకు ప్రభుత్వ సేవలను అందించేందుకై సుపరిపాలన దిశగా ఆవిర్భవించిందన్నారు. ఫిర్యాదు దాఖలు చేసిన తర్వాత, ఫిర్యాదుదారునికి ఒక ప్రత్యేకమైన రిజిస్ట్రేషన్ ఐడి లేదా నంబర్ ఇస్తారని ఈ నంబర్ ద్వారా, వారు తమ ఫిర్యాదు యొక్క పరిష్కార స్థితిని ఆన్లైన్లో లేదా కాల్ సెంటర్ 1100 ద్వారా తెలుసుకొనవచ్చునన్నారు. ప్రభుత్వ అధికారుల పనితీరులో పారదర్శకత పెరగాలన్నారు. ఫిర్యాదుల ద్వారా లభించిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ప్రభుత్వ సేవలను మెరుగు పరచడానికి అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. ఈ వ్యవస్థ ద్వారా ప్రభుత్వానికి మరియు పౌరులకు మధ్య వారధిగా అధికారులు పనిచేస్తూ సుపరిపాలన అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు వికాస జిల్లా మేనేజర్ గోళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు. **రామచంద్రపురం :** స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 12 అర్జీలు వచ్చాయని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఎండియు వ్యాన్ ఆపరేటర్ల వినతి,1- పంట నష్టం కోసం 2- పట్టాదారు పాసు పుస్తకములు 2- సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, 1- రేషన్ కార్డులో మార్పులు, 1- అక్రమ ఇసుక రవాణా 1- అక్రమంగా గుడి నిర్మాణము, 1- పెన్షన్1- దారి మార్గము ఇప్పించవలసి నదిగా అర్జీలు వచ్చినట్లు వివరించారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

ప్రజాశక్తి-ఐ.పోలవరం

టెన్త్, ఇంటర్మీడియట్ లో ఎక్కువ మార్కులు సాధించిన ఎస్‌సి విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. జి.వేమవరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సిద్ధార్థనగర్ గ్రామానికి చెందిన గొల్లపల్లి మాధవి,మోర్త సుస్మిత, రేవు రూప, ఇసుకపట్ల సిరివిద్య, రేవు జాహ్నవి,గొల్లపల్లి సత్య కిషోర్, శైలజకు అదే గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగులు గ్రామ పెద్దల సమక్షంలో టెన్త్, ఇంటర్మీయటలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, నగదును అందజేసి అభినందించారు. ఉద్యోగస్తులు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ప్రతీ దశలో టాపర్‌గా నిలవాలని సూచించారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఈ విజయం కేవవలం విద్యార్థుల ఒక్కరిదే కాదనీ, మీకు సహకరించిన మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులందరిధీ అని వారికి కూడా అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మోకా కృష్ణమూర్తి, యంటపల్లి నాగేశ్వరరావు, పండు శ్రీనివాస్, గొల్లపల్లి గంగాధరం, నిర్మల, పి.ఏడుకొండలు, రేవు అప్పారావు, చిన ధనరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మండల టిడిపి అధ్యక్ష కార్యదర్శులకు సత్కారం

ప్రజాశక్తి - ఆలమూరు

మండల టిడిపి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలుగా ఎన్నికైన ఈదల సత్యనారాయణమూర్తి (సత్తిబాబు), సలాది నాగేశ్వరరావులను మడికి టిడిపి అధ్యక్షుడు దొండపాటి సుబ్బరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలతో కలిసి మొక్కను బహుకరించి, పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మడికి గ్రామాన్ని మరింత అభివృద్ధి పరచాలని కోరారు. కార్యక్రమంలో కొత్తపల్లి కృష్ణ, టివివి సుబ్బు, పాలూ రి బుల్లబ్బాయి, మల్యాల రాజేష్, చెల్లబోయిన శ్రీనివాసు, కొత్తపల్లి సూరి బాబు, సత్తినేటి అప్పన్న, సూరంపూడి పట్టాభి రామయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులు కార్యక్రమంలో భాగంగా సోమవారం పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమం రిసోర్స్ పర్సన్ మేడిశెట్టి సాయిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సుమారు 30 మంది పాఠశాల విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎమ్‌వి.సూరిబాబు, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని పలు చిత్రాలను గీశారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని లైబ్రరీయన్ తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌గా రాజు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా కెవిఆర్ఆర్.రాజు నియమితుల య్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. గుంటూరు జిల్లాకు చెందిన కర్లపూడి వెంకట రాజరాజేశ్వర రాజు 2002 నుంచి కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఎప్పుటి వరకు బిహెచ్ఇఎల్ సత్తుపల్లి, నిడదవోలు, కందుకూరు, పాలకొల్లు, నరసాపురం, మున్సిపాలిటీలో సేవలందించారు. ప్రస్తుతం అమలాపురం మున్సిపాలిటీలో కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై రామచంద్రపురం మున్సిపల్ కమిషనర్‌గా ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన నాయుడు విశాఖ జిల్లా భీమిలికి బదిలీపై వెళ్లారు.

దస్తావేజులు పోయినవి

గండేపల్లి మండలం, సుబ్బయమ్మపేట గ్రామానికి చెందిన పొలము దస్తావేజులు పోయినవి. సర్వే నెంబర్ 196/2, భూమి విస్తీర్ణం ఎకరం 33 సెంట్లు, **దస్తావేజులు నెంబర్ 2263/1983,** సంబంధించిన గొల్లవిల్లి తాతారావు, S/o. అచ్చారావు చెందిన భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను తీసుకుని గండేపల్లి తహశీల్దార్ కార్యాలయానికి ది. 15-5-2025వ తేదీన మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఇప్పటివరకు వెతికినప్పటికీ దొరకలేదు. ఇవి దొరికినవారు క్రింది అడ్రస్‌కు సమాచారం ఇవ్వగలరు.

గొల్లవిల్లి రామకృష్ణ
సుబ్బయమ్మపేట గ్రామం, గండేపల్లి మండలం
సెల్: 9441906742

పాస్‌పోర్ట్ పడిపోయినది

అమలాపురం మండలం, పేరూరు గ్రామానికి చెందిన **ఇందుగుల సత్య నాగేంద్ర అశోక్** S/o. వెంకట రామకృష్ణ కు చెందిన **M 4448111** నెంబరు కల పాస్‌పోర్ట్ పడిపోయినది. జిరాక్స్ నిమిత్తము 18 మే 2025న పేరూరు, కొంకాపల్లిలోని మా ఇంటి నుండి అమలాపురం వచ్చుచుండగా మార్గ మధ్యలో పడిపోయినది. దొరికినవారు క్రింది అడ్రస్‌కు అందజేయగలరు.

అడ్రస్:
ఇందుగుల సత్య నాగేంద్ర అశోక్,
S/o. వెంకట రామకృష్ణ, పేరూరు, కొంకాపల్లి,
అమలాపురం మండలం- 533201
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
సెల్: 9154186777

పాస్‌పోర్టు పోయినది

కాకినాడ జిల్లా, కిర్లంపూడి మండలం, ముక్కోలు గ్రామానికి చెందిన దొడ్డా రాజా, వయస్సు 33 సం॥లు, తండ్రి: దొడ్డా ప్రసాద్, ముక్కోలు గ్రామం నుండి కిర్లంపూడి బస్సులో బయలుదేరి వెళ్తుండగా మార్గం మధ్యలో పడిపోయినది. నా యొక్క పాస్‌పోర్టు నెంబరు **R 9324910.** ఈ నెంబరు గల పాస్‌పోర్టు ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

నా అడ్రసు:
దొడ్డా రాజా
తండ్రి: ప్రసాద్, ముక్కోలు గ్రామం
కిర్లంపూడి మండలం, కాకినాడ జిల్లా
సెల్: 8179722759

ఒరిజినల్ లింక్ దస్తావేజు పోయినది

నా క్లయింటు **పచ్చిపాల సుందరరాజు,** S/o. మర్రియ్య, డో.నెం. 11-4-1, కొత్త బ్రిడ్జిపేట, కొవ్వూరు, పశ్చిమగోదావరి జిల్లా (ప్రస్తుతం తూర్పుగోదావరి జిల్లా) ఇచ్చిన సంజాయిషీ ప్రకారం, నా క్లయింటు యొక్క **ఒరిజినల్ లింక్ దస్తావేజు** అనగా **క్రయ దస్తావేజు నెం. 1265/2005, Dt. 27-4-2005,** కొవ్వూరు సబ్ రిజిష్టర్ వారి ఆఫీసులో రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింక్ దస్తావేజు **ది. 09-3-2025వ** తేదీన రాజమండ్రి ప్రకాష్‌నగర్ రౌండ్ పార్కు వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా పడిపోయినది. ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియపర్చవలసిందిగా కోరుచున్నాము.

బి.ప్రభాకరరావు, అడ్వకేట్
డో.నెం. 44-77-17/1, అన్నపూర్ణమ్మపేట
రాజమండ్రి, సెల్: 9440916878

కరోనా కిట్లు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

కరోనా వ్యాప్తి చెందుతున్న సందర్భంగా ఉపాధి కూలీలకు అవసరమైన మాస్కులు, శానిటైజర్లు, కిట్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని రాష్ట్ర మత్స్యకార సంఘం నాయకులు దోమ ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్లోని విశాఖపట్నం, కె.గంగవరం మండలంలోని సత్యవాడ గ్రామాల్లో కరోనా కేసులు వెలుగు చూస్తున్న సందర్భంగా సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దీనిపై ప్రభుత్వం ఆస్పత్రులు పీహెచ్సీలను ఆరోగ్య కేంద్రాల్లోనూ కరోనా కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. సభలో సమావేశాలు వంటివి వాయిదా వేసుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వెంటనే ఉపాధి కూలీలు గుమిగూడి పెద్ద ఎత్తున పనులు చేస్తున్నందున వారికి అవసరమైన మాస్కులు , శానిటైజర్లు, మందులు అందు బాటులో ఉంచాలని ఆయన ప్రభుత్వాధికారులకు విజ్ఞప్తి చేశారు.

బహిరంగ ప్రకటన

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండపేట మండలం, తాపేశ్వరం గ్రామ కాపురస్తులు మేడిశెట్టి నీలకంఠేశ్వరరావు గారి కుమార్లు 1. మేడిశెట్టి శివస్వామి పవన్‌కుమార్, 2. మేడిశెట్టి నాగ శివ గణేష్ అను మేము ప్రమాణముప దాఖలు చేసుకున్న అఫిడవిట్ కమ్ ఇండెమినిటీ బాండు సంగతులు ఏమనగా,

డా॥ బి.ఆర్.ఏ.కోనసీమ జిల్లా, మండపేట మండలం, తాపేశ్వరం గ్రామం తాలూకు స్థిరాస్తికి సంబంధించిన క్రయ దస్తావేజుకు ద.నెం. 6769/2024రుకు గల **లింకు దస్తావేజు నెం. 477/2017రు** మిస్ అయినది. కర్రి సత్యవతి వగైరాలు పేర గల శెటిల్మెంటు దస్తావేజు అయివున్నది. సదరు ద.నెం.6769/2024రుకు లింకు దస్తావేజు అయివున్నది. సదరు, పైన వివరించబడిన లింకు దస్తావేజును పోగొట్టుకున్న విషయమును గురించి పోలీసు వారికి కంప్లెంట్ చేయడం కూడా జరిగినది. అలాగే ది. 27-05-2025వ సం॥రం తేదీన ప్రజాశక్తి న్యూస్ పేపర్ నందు దస్తావేజు పడిపోయినవని ప్రకటన కూడా యిచ్చియున్నాను. గనుక సదరు పై విషయములు అన్నియూ యదార్థములు అనియూ, సదరు విషయములు భవిష్యత్తులో అవాస్తవములని తెలియవచ్చిన యెడల మీరు నాపై జరిగించు చట్టపరమైన చర్యలకు మరియు ఐ.పి.సి. 199/200రు ప్రకారం నాపై మీరు తీసుకొని చర్యలకు నేను పూర్తి బాధ్యత వహించగలనని యిందుమూలముగా తెలియజేయుచున్నాను

ఎన్.తాతారెడ్డి, అడ్వకేట్/ నోటరీ
రామచంద్రాపురం రామచంద్రాపురం
ది.26-5-2025 సెల్: 98866 960337

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 28/2008

Between:
లంక రాంబాబు -వాది
AND
కొరుప్రోలు నాగరాజు (died) వగైరా -ప్రతివాదులు

వాది దాఖలు చేసిన పేపరు ప్రకటన

దావా సమన్లు:

D-10: మేడిశెట్టి రమణమ్మ, W/o. అప్పారావు, వయస్సు 44 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-11: నవుడు నాగలక్ష్మి, W/o. నూకరాజు, వయస్సు 37 సం॥లు, గృహిణి, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-12: సబ్బారపు ఏసమ్మ, W/o. వాసు, వయస్సు 36 సం॥లు, గృహిణి, పట్టిసీమ, ప॥గో॥జిల్లా.

D-13: మేడిశెట్టి రజని, W/o. వెంకన్న, వయస్సు 32 సం॥లు, గృహిణి, దొండపూడి, గోపాలపురం మండలం, ప॥గో॥జిల్లా.

D-14: కైసర్ల వీరబాబు, W/o. సాంబమూర్తి, వయస్సు 45 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

D-15: కైసర్ల చిన్న, S/o. సాంబమూర్తి, వయస్సు 39 సం॥లు, వ్యవసాయం, జంగారెడ్డిగూడెం, ప॥గో॥జిల్లా.

పై నెంబరు దావాలో మీకు దావా సమన్లు ఎన్నిసార్లు పంపినా మీరు తీసుకోనందున మీకు దావా సమన్లు నిమిత్తం మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు అగు నిమిత్తం ది. 18-6-2025వ తేదీకి వాయిదా వేసినారు. కావున మీకు ప్లయింటు పరిహారములపై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల **ది. 18-6-2025వ తేదీని ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

వాది తరపు న్యాయవాదులు
సాదే నరసింహారావు
బొగ్గవరపు సత్యన్నారాయణమూర్తి
పెద్దాపురం పెద్దాపురం
ది.25-5-2025 సెల్: 9885084194

పబ్లిక్ నోటీస్

నా క్లయింటును ప॥గో॥జిల్లా, పాలకోడేరు మండలం, గొల్లలకోడేరు గ్రామ కాపురస్తులు శ్రీ ముదుండి బంగార్రాజు గారి భార్య: ముదుండి పద్మావతి గారు మాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియచేయునది.

మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారి తల్లి గారైన అల్లూరి వెంకట సుబ్బరాజు గారి భార్య అల్లూరి అనసూయదేవి గారి మరణానంతరము మా క్లయింటు తల్లి గారు వ్రాసిన వీలునామా ప్రకారము ది. 27-01-2025 నుండి మా క్లయింటుకు చెందిన ఆస్తులపై మా క్లయింటు ముదుండి పద్మావతి దేవి గారికి చెందిన ఆస్తులపై ఇతరులు ఎవ్వరికీ ఎట్టి అధికారం లేదనినూ సదరు ఆస్తులకు ఎవరైన తనకాలు, కౌలు, అగ్రిమెంట్‌లు, మరియు అమ్మకములు చేసిన అట్టివి చెల్లవని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము. ఈ నోటీసులో ఆస్తులను ఎవరైనా అగ్రిమెంట్స్, లీజు, తనకా, అమ్మకము, కొనుగోళ్ళు చేసిన ఎడల అట్టివారిపై చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోబడును. అని ఈ నోటీసు ద్వారా తెలియచేయుచున్నాము.

ఆస్తుల వివరములు:-

1. A.K.S జిల్లా, రాజోలు మండలం, శివకోడు గ్రామంలోని R.S. No: 726 యా.2.06 సెంట్లు A.K.S జిల్లా, రాజోలు మండలం, చింతలపల్లి గ్రామంలోని, R.S. No: 141/1 యా.2.38 సెంట్లు R.S. No: 142 యా.0.41 1/3 సెంట్లు, R.S. No: 71/18, 16 యా.0.32 సెంట్లు కొబ్బరితోట మరియు R.S. No: 141/G, యా.1.90 సెంట్లు మరియు
2. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని D.No: 1-57/1, RCC భవనం మరియు దానికి చెందిన 1408 చ.గ స్థలమును, R.S. No: 185/7 యా.0.66 సెంట్లు R.S. No: 185/8 యా.0.47 సెంట్లు, R.S. No: 185/10, యా.0.06 సెంట్లు, R.S. No: 184/1 యా.1.10 సెంట్లు, R.S. No: 184/2 యా.0.96 సెంట్లు, R.S. No: 184/3 యా.0.20 సెంట్లు, R.S. No: 184/6 యా.0.77 సెంట్లు, R.S. No: 184/7 యా.0.40 సెంట్లు, మరియు
3. ప॥గో॥జిల్లా, గణపవరం మండలం, కేశవరం గ్రామంలోని SBI Branch A/c 11557324941, CIF No: 81276280320 అల్లూరి అనసూయ దేవి గారికి చెందిన నగదును మరియు MRF కంపెనీ వారి ప్రాథమికంగా కేటాయించిన షేర్లు 487 మరియు పోస్టల్ డిపాజిట్లు మా క్లయింటుకు మాత్రమే చెందుతాయని ఇతరులు ఎవ్వరికీ ఏవిధమైన హక్కులు లేవని ఈ నోటీస్ ద్వారా తెలియచేయుచున్నాము.

గూడూరి సాంబమూర్తి
సెల్: 99487 54306
గరికిముక్కు సుబ్బయ్య
సెల్: 99595 58600
అడ్వకేట్స్, భీమవరం

పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

అన్ని పరిశ్రమలలో 75 శాతం స్థానికులకే ఉపాధి కల్పించాలని జాతీయ న్యాయ పోరాట సమితి డిమాండ్ చేసింది. సోమవారం స్థానిక మున్సిపల్ సెంటర్లో వేమగిరి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు పలువురు మాట్లాడుతూ పరిశ్రమలలో కనీస వేతనాలు, కార్మిక చట్టాలు అమలు కావడం లేదన్నారు, ముఖ్యంగా కార్మికులకు సంబంధించి పరిశ్రమలలో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ఈ సమావేశంలో సంకు దావీదు రాజు, ఆకుమర్తి సత్యనారాయణ, సిహెచ్ వెంకటేష్, ఎం రుద్రయ్య, టి సుబ్బారావు తదితరులు ప్రసంగించారు.

కళాకారులను గౌరవించాలి

ప్రజాశక్తి-కిర్లంపూడి

సమాజంలో కళాకారులను ప్రతి ఒక్కరూ గౌరవించాలని మాజీ మంత్రి, వైసిపి రాష్ట్ర పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు ముద్రగడ పద్మనాభం, ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముద్రగడ గిరిబాబు అన్నారు. సోమవారం ఉత్తర కోస్తా జిల్లాల శ్రీఅన్నమయ్య కళాక్షేత్రం కమిటీ అధ్యక్షులు సానా నూకరాజు నాయుడుతోపాటు పలువురు పద్మనాభం, గిరిబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. దిడ్డి సునీత, రాంబాబు, దాట్ల రంగరాజు, పైలా అప్పలనాయుడు, దాసరి సూర్యనారాయణ రావు, అత్తి వెంకట సుబ్బారావు, సిద్ధ రామచంద్రరావు, బావిరిశెట్టి వెంకటేశ్వరరావు, కడారి శ్రీనివాసరావు, కప్పల సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి-తాళ్లరేవు

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే అంకితభావంతో చదివి సమాజానికి ఉపయోగపడే విధంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని ప్రముఖ వైద్యులు చెక్క సింహాచలం అన్నారు. నీలపల్లిలో సిపిఎం మండల కన్వీనర్ టేకుమూడి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగిన విద్యార్థుల అభినందన సభలో వైద్యులు చలం మాట్లాడారు. మంచి మార్కులు సాధించడమే కాకుండా మంచి నైపుణ్యాలు, లక్షణాలు మంచి వ్యక్తిత్వం కలిగి ఉండాలని అన్నారు. పదో తరగతి ఇంటర్మీడియట్ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన గంటా సాయి చరణ్, పోతుల సుశాంత్, సాబత్తుల లక్ష్య, కాకినాడకు చెందిన పలివెల దివ్యకు ఆయన ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మోకా మధుబాబు, సిపిఎం జిల్లా నాయకులు కమిడి సత్య శ్రీనివాస్, పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, GOGINA SRINIVASA RAO, S/o Late Venkata Ratnam and Residing at D.No.2-76/1, Samisragudem Village, Nidadavole Mandal, E.G.Dist., I have Changed my name from **GOGINA SRINIVAS (OLD NAME)** to **GOGINA SRINIVASA RAO (NEW NAME).** Henceforth I am being called as **GOGINA SRINIVASA RAO** for all purposes.

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజను) వారి కోర్టులో
F.D.I.A. 2/2024
O.S. 320/2021

Between:
పిటిషనరు (వాది): సలాది లక్ష్మి
AND
రెస్పాండెంటు (ప్రతివాది):
షేక్ కరీముల్లా

To:
షేక్ కరీముల్లా, S/o. ఖాదర్, టైలరింగ్ & ఫ్యాన్సీ స్టోర్స్, డోర్ నెం. 7-206, మలకపల్లి, తాళ్లపూడి (మండలం)

పై నెంబరు దావాలో ది. 07-2-2023వ తేదీన పాస్ కాబడిన ప్రిలిమినరీ డిక్రీను బట్టి ఫైనలు డిక్రీ పాస్ చేయించమని కోరుచూ పిటిషనరు (వాది) మీపయి పై నెంబరున ఫైనలు డిక్రీ పిటీషను దాఖలు చేసినందున అందుపయి మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల మీరు **ది. 20-6-2025వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట హాజరయి మీ ఆక్షేపలు తెలియపరచుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలముగా మీకు తెలియచేయడమైనది.

వల్లభనేని వెంకట సుబ్బారావు
పిటిషనరు తరపు అడ్వకేటు
కొవ్వూరు, సెల్:9440344152